


# కల్యాణి

బులుసు వేంకటరమణయ్య గారు

౧

రాత్రి దాదా పెనిమిదిగంటలకాల మైయుండును. భగవంతుఁ డగు లోకబాంధవుఁడు చరమగిరికరుగఁగనే యంతర్గృహములందు సంచరించుట మాని సూర్యాస్తమయకాలమును దొంగిలింగి మామ చీఁకటు లిప్పుడు నిరాటంకముగఁ జతుష్పథముల సంచరింపఁ దొడంగెను. నాఁటిదినము కృష్ణపక్షచతుర్దశి యగుటచేఁ జంద్రుని జాడయే లేకుండెను. నక్షత్రములు గొన్ని మినుకుమినుకు మని మెఱయుచుండెను. పురపాలక సంఘమువారిచే నియమింపఁబడిన దీపములు ప్రాణావశిష్టునిఁ బోలె నెలనెలఁ బోవుచుండెను. పురమునఁ గల యింగ్లీషుకొట్టుకొట్టి చొప్పుననే మూయఁబడుచుండెనుగాని నగరబహిర్భాగమునఁగల సారాయి దుకాణము చెంత సందడి యధికమగుచుండెను. ఇట్టిసమయమున నొకయువకుఁ డిరువది వత్సరముల వయస్సుగలవాఁ డాయాపణము చెంతనుండి నగరమును బ్రవేశించుచుండెను. అతని శరీర మతికఠినమై నీలమై చూపరుల కొకింత భయముఁ గొల్పుచుండును. ఆతఁ డమితముగ ద్రాక్షారసపానము చేయుటచేఁ గన్ను లగ్నికణములవలెఁ బ్రజ్వలించు చుండెను. రసపానము చేయుటచేత నాతఁడు మైమఱచి జోగుచు, తోఁద్రోపెఁబడుచు, లేచుచుఁ, దన్నెఱింగినవారి కంటఁబడితినేమో యనుభయమున నలువంకలఁ బరికించి తెగువిగల వానివలెఁ జరచర నాల్గడుగులు వేయుచు, మఱల స్మృతి తప్పిపడుచు నెట్టకేలకు గ్రామమధ్యమునగల విశాలగృహప్రాంగణమును జేరుకొనెను. తన స్నేహితుఁడగు నొక బాలుఁడు "విలాసా! ఇంతవఱ కెచట నుంటివి? శరీరమున కస్వాస్థ్యము కలుగలేదుకద!" అను మాటలలోఁ గడపటిదానికే "లేద"ని యస్పష్టముగ నుత్తరమిచ్చి తనగదిఁ జేరి తలుపు మూసికొనెను. ఒకగంటకాల మైన పిదప గదితలుపు తెఱచుకొని పరు లెవ్వరును లేని సంగతిని దెలిసికొని తనగది కెదురుగనున్న గదిఁ బ్రవేశించి, జేబుకొయ్యకుఁ దగుల్పఁబడిన తాళములను జప్పుడు కాకుండఁ దీసి వసారాను దాటి మఱియొకగదికడ కరిగి యొకతాళముతోఁ దలుపు తెఱచెను.

అది యొక యౌషధాగారము. మిక్కిలి విలువ గలవియు, వివిధములు నగు నౌషధము లాగదియందు భద్రముగా నుంపఁబడును. ఆ గదియం దొకబల్లయు దానిపై వివిధము లగు ద్రావకములతో నింపఁబడిన సీసాలును గలవు. ఆబల్లకుఁ బ్రక్క నొకబీరువా గలదు. అందును విలువగల మందుసీసాలును, జూర్ణములు గల పొట్లములును శస్త్రవైద్యమున కుపయోగించు వస్తువులును గలవు. క్రిందఁ గొన్ని ఖల్వములలో సగము నూరఁబడిన యౌషధములు గలవు. విలాసుఁ డాగదిఁ బ్రవేశించి నలువంకలఁ బరికించెను. ఒకగోడకుఁ దగుల్పఁబడిన చిన్నదీపము వెలుఁగుచుండెను గాని మఱియెట్టివిధమైన కాంతియు లేదు. విలాసుఁడు తొందరతోఁ దలుపు మూసి బీరువాను దెఱచి యందుఁ గల చూర్ణములను బరికించుచుండెను. వేఱువేఱు స్థలంబులనుండి రెండుపొట్లములను దీసి వానిపైఁగల పేరులం జదివి కొంతవఱ కాలోచించి, తిరిగి దీపమునొద్ద వానిపైఁగల పేరులం జదివి బల్లపై నారెండుపొట్లముల నుంచి భద్రముగ మూఁత నూడఁదీయుచుండెను. హత్యను జేయువానివలె వానిచేతులు కంపింపఁ దొడంగెను. ఆతనితల తిరుగుచుండెను. పానమత్తతచే నాతఁ డొకపరి జోగెను. అప్పు డాతనిచేతికిఁ దగిలి యొకగాజుసీసా బ్రద్దలై పోవ నందుండి ద్రావకము ఒలికిపోయెను. అప్పు డొకించుక శబ్దమగుటచేఁ బరు లనుమానింతురేమో యని యాతఁ

డించుక సేపు నిశ్శబ్దముగ నుండెను. అప్పు డొకమానవుని ఛాయ విలాసుని కగుపడెను. కాని యాప్రకృతి గదిఁ బ్రవేశింపలేదు. విలాసుఁడు పొట్లములను విప్పి వానియం దుండు మందును వినిమయము చేసి (ఒకపొట్లమున నుండు మందును మఱియొకపొట్లమునను, మఱియొకదానియందుఁ గలదాని నీపొట్లముననుఁ బెట్టి) మామూలుగా మూఁతల నంటించెను. అంటించి యాపొట్లములపై నొకసారి చూచెను.

ఒకపొట్లముపైఁ 'దలనొప్పికి మం' దనియు, మఱియొకదానిపై 'విషద్రవ్య' మని యును వ్రేర్లుగలవు. అవి చూచి విలాసుఁడు సంతోషముతో "ఆహా! ఇన్ని దినములనుండి నేఁజేయు ప్రయత్నము నేఁడు సఫల మైనది. దురాత్ముఁ డగు జగన్నాథునకుఁ దలనొప్పి తఱచుగ వచ్చుచుండునుగదా! ఆ సమయమున నియ్యది దలనొప్పిని బోఁగొట్టుమందే యని, నేను మార్చిన యీ మందును దినిపించెదను. క్రూరాత్ముఁడు మోహనునివలె నన్నుఁగూడ మోసముచేసి ధనము నపహరించెను. ఇంక నాధనమంతయు నాయదియే" అని పలుకుచుండెను. హర్షాతిరేకమున నాతఁ డొడలు మఱచియుండెను. ఇంతలో రాత్రి యధికమయ్యెనని తెలిసికొని యాతఁడు మెల్లమెల్లగ నా యౌషధముల నుచితస్థలమున నుంచి యాగది దాటి వెలుపలికిఁబోయెను. సంతోషాతిశయమున నాతఁడు తన జేబురుమాలు నాగదియందు మఱచిన సంగతి నేగు రెఱుంగలేదు.

వాసుదేవరావుగారు రామతీర్థనివాసులు. విశేష ధనవంతులు. మఱియుఁ బ్రఖ్యాతివహించిన వైద్యులు. వారు ధనవంతులైనను ఇప్పటివారివలె వ్యర్థముగఁ గాలముఁ గడుపువారు కారు. పరోపకారమునకై సర్వదా కష్టపడుచుండురు. దీనవారైననేమి, శ్రీమంతులైననేమి ఎవ్వరికడనుండియైన నొకదుగ్గిగవ్వనైన గ్రహింపక రోగుల కుచితముగ నౌషధములనిచ్చుచుందురు. ఆచుట్టుప్రక్కల నుండుజను లాతనిని భగవంతునిగ భావించుచుందురు. వేయేల! ఆయన యిచ్చిన యెట్టిమందైన సంజీవియని వారిభావము. ఇట్టిసత్పురుషులకుఁ బుత్రసంతానము లేకపోవుట యొకకొఱతయైయుండెను. కాని

పదునాల్గు వత్సరముల వయసు గలిగి రెండవ లక్ష్మివలెఁ బ్రకాశించుచు, సకల సద్గుణోపేతయైన పుత్రికను గల్యాణినిఁజూచి యాతఁ డానందించుచుఁ బుత్రులు లేని దుఃఖమును బొందలేదు. పితరులు లేని మేనల్లుని-విలాసుని-బెంచుచుఁ బెద్దవానిని జేసిరి. వానికిఁ గల్యాణి నిచ్చి వివాహము చేసి వాని నొకయింటివానిగఁ జేయఁదలంచిరి గాని దుండగీడగు విలాసున కాపాటియదృష్టము లేకపోయెను. విలాసుఁడు విలాసవంతుఁడై చదువుమాని, సురాపానముఁ జేయుచుఁ గాలముగడపుట చూచి వాసుదేవరావుగారు స్వప్రయత్నమును మానుకొనిరి. వాసుదేవరావుగారి మేనల్లునేకాక తల్లిదండ్రులు లేనిబాలుని బంధుకోటిలోనివానిని, మోహనుని బెంచి పెద్దవానిని జేసెను. ఆతఁడు రావుగారి యాజ్ఞప్రకారమై మెలఁగుచుండెను. రావుగారు తమ యభిమానవిద్య యగు వైద్యమున నీబాలుని దమయంతవానిని జేసి తమపైఁ గల సగముభారము నాబాలునిపై నుంచిరి. ఆబాలుఁ డాయింటివారికే కాక చుట్టుప్రక్కలనున్న జనులకుఁగూడఁ బ్రేమాస్పదుఁడని నొక్కి చెప్పవచ్చును. సద్గుణవంతునిఁ బొగడనివా రెవ్వరుందురు?

మోహనుఁడు పదునెనిమిదివత్సరముల యీడుగల సౌందర్యవంతుఁడు; స్ఫురద్రూపి. అందుచేతనే భగవంతుఁడు సమవయోరూపులగు కల్యాణీమోహను లన్యోన్యముఁ బ్రేమించుకొనునట్లు చేసెను. అది యేమిచిత్రమో కాని వారిరువురును శరీరమాత్రమున భిన్నులు కాని హృదయ మాయిరువురి కొక్కటియే. అంకురించిన వీరి యన్యోన్యానురాగ మెప్పుడు ఫలించునోయని వీరు నిరీక్షించుకొనుచుండిరి.

మోహనుఁడు ధనవంతులఁ బిడ్డఁడైయైనను దన దురదృష్టవశమునఁ దలిదండ్రులతోఁ గూడ ధనమును గోలుపోయెను. తన కొకవ్రేలు విడిచిన మేనమామయగు జగన్నాథుఁ డన్యాయముగ నతనిసొత్తపహరించెను. 'పాపమునకుఁ బ్రాయశ్చిత్తము వెంటనేయగు' నను లోకోక్తి చొప్పున నచిరకాలముననే వాని దారాపుత్రులు మరణించిరి. ఇట్లయ్యును, లోభియగు నా మూర్ఖుఁడు ధనమును మోహనున కీయలేదు. దిక్కులేని యీ బాలుని వాసుదేవరావుగారు పోషింపకుండినచో నీ

బాలుఁడుగూడ నింతకుఁబూర్వమే మరణింపవలసి యుం డునుగాని భగవంతుఁడు బాలుని రక్షించుటచే నాతనికెట్టి యపాయము లేకుండెను.

విలాసుఁడు జగన్నాథుని సమీపబంధువు. కుటిలుఁడగు నిబ్బాలుఁడు జగన్నాథుని వంచించి ధనము నపహరింపఁదలంచి యనేకములగు పన్నుగడలను బన్నెను. విలాసుఁ డొకపరి తన వివాహమునుగూర్చి మేనమామ నడుగ నాతఁడు "వత్సా! నీవు నీభార్యను బోషింప సమర్థుఁడ వేని నీకుఁ గల్యాణి నీయవచ్చు"నని పలికెను. తన సామర్థ్యమును వాఙ్మాత్రమునఁగాక క్రియారూపమున మామకుఁ దెలుపఁగోరి ధనసంపాదనముకై యహర్నిశములు పాటుపడుచుండెను. తాను గల్యాణితో వివాహవేదికపై నెప్పుడు కూర్చుందునో యని యాలోచించు చుండెను; లీలోద్యానమున నాబాలికతోఁగూడ మందమలయానిలముల నెప్పుడు సేవింతునో యని యువ్విళ్లూరు చుండెను. పాప, మీమూఢుఁడు కల్యాణీ మోహనుల యన్యోన్యానురాగము నించుకైనఁ దెలిసికొనకుండెను. ఆహా! ఎంతటి వెఱ్ఱి? వేళలకుసుమ మగ్నిని బడదనుసంగతి నీతఁడు గ్రహింపలేదు.

## 3

సాయంసమయము ఐదుగంటలకాల మైనది. వాసుదేవరావుగారియింటికి వెనుకఁ గల లీలోద్యానమునఁ గల్యాణి విలాసార్థమై తాను బెంచుకొనుచున్న గులాబి, చేమంతి, చెంబేరి, సన్నజాజి, మల్లె, మొక్కలకు నీరు పోయుచుండెను. తోఁటకాఁపు "వలదు, వల"దని యెంత బ్రతిమాలుచున్నను బాలిక తనపనిని మానలేదు. ఇంతలో వెనుకనుండి మోహనుఁడువచ్చి యాబాలికయొక్క కన్నులను మూసెను. అది యెఱిఁగి కల్యాణి (నవ్వుచు) "విడువుము. దొంగవలె వెనుకనుండి పట్టుకొనుట తగునా!" అనెను.

మోహ—కల్యాణీ! నిన్నుఁ జూచినంత మాత్రమున నా హృదయమును దొంగిలిన నీవే దొంగవు.

కల్యా—మోహనా! నీరూపమున నన్ను మోహింపఁ జేసి నాచేతమును హరించిన నీవు దొంగవుకావా!

మోహ—బాలవయ్యు నీబుద్ధి యప్రతిహతమైనది. [అని చేతులుదీసి బాలికముఖమును జూచి] కల్యాణీ! నీ ముఖ మీదినమునఁ గొంచెము వాడియున్న ట్లున్నది? కారణము చెప్పవచ్చునా!

కల్యా—మోహనా! నీకుఁ జెప్పఁదగని కారణ మేమి గలదు? నాప్రాణముగ భావింపఁబడుచున్న నీవు నన్నన్యథా తలంచుట యెఱింగి నా ముఖము కళఁదక్కియుండునేమో!

మోహ—అయ్యో! న న్నట్టి కఠినహృదయునిగ నేతలంచుచుంటివా! [మోహనుని కనుకొలుకులనుండి రెండశ్రుబిందువులు రాలెను. కల్యాణిని స్తబ్ధయైపోయెను.)]

కల్యా—నేను ని న్నెట్లు భావించుచుంటినో నీవ యెఱుంగుదువు. కాని మోహనా! నీకు నాయందమితమగు ప్రేమగలదని యెన్నిసారులు చెప్పినను నా మనస్సాక్షియూరటఁ జెందలేదు. నీవు నా హృదయమునకు స్వాస్థ్యముఁ గలుగఁజేయవా!

మోహ—ప్రేయసీ! ఇంత యనుమానమేల? షోడశకలాపూర్ణుండగు చంద్రుఁడు సాక్షిగాఁ దెలియఁజేయుచున్నాను. నాకు నీయం దమితమగు ప్రేమకలదు.



ఇంతలో వెనుకనుండి మోహనుఁడువచ్చి యాబాలికయొక్క కన్నులను మూసెను.

కల్యా—వలదు. వలదు. దినదినము క్షీణించెడి దోషాకరుఁడు సాక్షియా! [నవ్వి] నీకు నాపైఁ గల ప్రేమను గూడ నిట్టి క్షయమును బొందుననియా నీ యాశయము?

మోహ—త్రిలోకైకపూజ్యుం డగు, శ్రీరామచంద్రుని సాక్షిగాఁ జెప్పుచున్నాను. ఇఁక.........

కల్యా—(అర్ధోక్తియందే) నాకు సాక్ష్యమేవలదు. నీ మనస్సే సాక్షి. నేనే పూర్తిగ నమ్మితిని. ఏ నా ప్రాణాధికుఁ డగు భగవంతుఁడు విశ్వజనీనుండై నిష్కళంకుఁడై నాయం దమితమగు ప్రేమఁ జూపి నా కపారమగు స్వాస్థ్యమును గలుగఁజేసెనో, ఏ మహాత్ముఁడు సర్వదా నా హృదయసీమయందు మెలఁగునో, ఆభగవంతు నీ కుసుమమాలికతోఁ బూజించి నా కృతజ్ఞతను వెల్లడించుకొందును. [అని సమీపమునఁ గల మాలికను దీసి మోహనునికంఠము నలంకరించెను. మోహనుఁ డానందపరవశుఁడై నోట మాటలేక చేష్టదక్కియుండెను.]

* * * * *

సూర్యుఁ డపరాంబుధిఁ గ్రుంకనూంకించుచుండెను. కల్యాణి గృహమునకుఁ బోవ నుంకించుచు "మోహనా! సాయంకాలమైనది. నే నింటికిఁ బోవనిచోఁ దలిదండ్రు లనుమానింతురు. కాన నా కనుజ్ఞ నిమ్ము" అని మోహనునితోఁ బలికి రెండడుగు లరిగి జ్ఞప్తినటించి వచ్చి, "చెప్పమఱచితిని. అమ్మకుఁ గొంచెము తలనొప్పి వచ్చినట్లు తెలిసికొంటిని. ఆమె తనబాధను గప్పిపుచ్చినను ముఖవైవర్ణ్యమా బాధను జెప్పకయే చెప్పుచున్నది. కాన నేఁడైన నొకమందు భద్రముచేసికొని యున్నచో మంచిది" అని మృదువుగఁ బలికెను. అంత మోహనుఁడు "అటులనా! మన కిచ్చువచ్చిన మందుల నవలీలఁగఁ దేఁగలను. నేనును నీవెనువెంట నేవచ్చి మందు తెచ్చెదను" అని పలికెను. బాలిక గృహాభ్యంతరమునకుఁ బోయెను.

ఇంతలో విలాసుఁ డాసమీపమునకు వచ్చి మోహనునిఁ జూచి "ఓహో! ఆడఁబోయినతీర్థ మెదురైనట్లు నీ విచటఁ దటస్థించితివే!" అని పలికెను. మోహనుఁడు "విలాసా! అత్యవసరము లగు కార్యము లేవైనఁ జేయ నక్కఱలేదుగద!" అని యనెను.

విలాసుఁడు—[విచారమును నటించి] మఱి యేమియును లేదు. అనిష్టమైనను జెప్పక తప్పదు గనుక చెప్పుచున్నాను. అనకాపల్లిలో నున్న మీపినతండ్రి చాల నపాయమున నున్నాఁడట! జీవించునను ఆశ లేశమైనను లేదట! నీవతిత్వరగ రావలెనని చెప్పిరట.

మోహ—(తొందరతో) ఎవ్వరెవ్వరు! ఎప్పు డెవరు వచ్చిరి?

విలా—ఉత్తరము వ్రాసిన నాలస్యమగుననియు, బాలుఁడ వగు నీ వొంటిగాఁ బోలేవనియు నెంచి మనిషి నొకనిని బంపిరి. ఆతఁ డిప్పుడే వచ్చెను.

మోహ—ఆహా! ఎంతటికష్టము! నే నిప్పుడే పోవలెననుకొనెదను.

విలా—ఇప్పు డెట్లుపోఁగలవు? రాత్రి విజయనగరము నుండి పోవు రైలుబండి నెక్కిపోయినచో రేపటి యుదయమునకుఁ బోవచ్చును.

మోహ—అటులనే చేయవలయును. మాయదృష్ట మెట్లున్నదో! అని యనుకొనుచు విలాసునితోఁగూడ నాస్థలమును విడిచెను.

## ౪

వాసుదేవరావుగారును మోహనుఁ డనకాపల్లికిఁ బోయినదినమునకు మఱుసటి దినముననే కార్యాంతరముపై విశాఖపట్టణమునకుఁ బోయిరి. అదియే యుక్తసమయమని యెంచి స్వకార్యమును బూర్తి చేయఁదలఁచి విలాసుఁ డౌషధాగారమునఁ బ్రవేశించి, బీరువాను దెఱచి యిదివఱకుఁ దాను మార్చియుంచినమందు లేకపోవుటచేఁ గళవళపడెను. తాను జేయఁదలంచినకార్యము గొనసాగకపోవుటయే కాక నిరపరాధియగు మఱియొకజీవి మరణింపఁబోవుటచే నాతఁడు నిశ్చేష్టుఁడై వెలవెలఁబోయెను. కొంతవడికిఁ దెలివినొంది స్వయంకృతాపరాధమును దిద్దనాలోచన చేసెను.

* * * * *

కల్యాణి!—మోహనుని వీడుకొని తల్లికడ కేఁగి యమృతాంజనము నుపయోగింప నామె బాధ నివారణ మయ్యెను. పిదప మోహ

నుఁ డౌషధమునీయ నెప్పటికయిన నుపయోగించు నను తలంపున దానిని భద్రపఱచెను. అచిరకాలముననే మోహనుని పినతండ్రికి విపరీతమగు రోగమువచ్చెనని తెలియుటచేతను, మోహనుఁ డూరలేకపోవుటచేతనుగూడ నామె యస్తిమిత మనస్కయయ్యెను. అందుచేత నామెకుఁ దలనొప్పిరాఁగా నమృతాంజనము నుపయోగించెను. కాని మానసికరోగమునకుమందుండునా! అమృతాంజనమువలన బాధ యుపశమింపలేదని యామె మోహనుఁడిచ్చినమందు నుపయోగింపఁదలంచి, రెండుమూఁడు మాత్రలను దినెను. ఇంతలో నామె కమితమగుఁ గంప ముదయించెను. నోట మాట లేకపోయెను. ఇతరులతోఁ జెప్పకుండఁ దనగదికేఁగి మంచముపైఁ బరుండెను. ఆమె మోహనునివిషయమై యెట్టియనుమానమును బొందలేదు. దుష్టులెవ్వరో యౌషధమును వినిమయముచేసిరనియు, నిష్కపటుఁడగు మోహనుఁడు మోసమెఱుంగక తనకిచ్చెననియు నామె భావించెను. నిరపరాధుఁడగు మోహనునకుఁ దనమూలమున నెట్టియిక్కట్టును గలుగకుండుటకై మనసార భగవంతు నొకపరి ధ్యానించి నిమీలితలోచనయయ్యెను.

సాయంకాలమైనది. కల్యాణి యింట సంచరించుట లేదు. కల్యాణి యిరుగుపొరుగులవారియిండ్లకుఁ బోవదని తల్లి యెఱుంగును. బాలికజాడ లేనందునఁ దల్లి హృదయమున నొకఱాయి పడినట్లు తలంచెను. గృహమున నందఱును వెదకి తుదకు గదిలోనే పడుకొనియున్న కల్యాణిని గాంచిరి. బాలికకు రోగము వచ్చినదేమో యని తల్లి వడివడివచ్చి యామెశరీరముపైఁ జేయివైచి చూచెను. శరీరము చల్లనై యుండెను. కన్నులు మూతఁబడిపోయెను. నాడి యాడుచున్నట్లు లేదు. మిక్కిలి పరీక్షించినఁగాని యూపిరి సూక్ష్మముగ వచ్చుచున్నదనుసంగతి తెలియకుండెను. కాన తల్లి కాయనుమానము లేకపోయెను. "హా! గృహలక్ష్మీ! సుమంగళా! కల్యాణీ! నన్నుఁ గన్నతల్లీ! మందభాగ్యులమగు మమ్ము వీడిపోయితివా!" యని యేడ్చియేడ్చి దుఃఖభారము నాపుకొనలేక మూర్ఛవోయెను. విలాసుఁ డిదియంతయుఁ జూచి కాలుసేతులు గడగడవడంక నోట మాట లేక వెఱ్ఱివానివలె నిటునటుఁ దిరుగుచుఁ బొరుగింటి కగ్నిని ముట్టింపఁదలఁచి తనగృహమునే దగ్ధముచేసితి నను కొనుచు నాభారము తనపైఁ బడకుండఁ దప్పించుకొనఁ గోరి రక్షకభటాలయమునకుఁ బోయి "బాలిక విషప్రయోగమున మరణించె"నని చెప్పఁదలంచెను. గుమ్మము దాటగనే మోహనునికి వార్తఁ దెచ్చిన వార్తాహరుఁ డెదురుపడి "మోహనుని ధూమశకట మెక్కించి మాయ చేసి నేను వచ్చితిని. నా కవకాశము చిక్కనందున వెంటనే చెప్పఁజాలకపోతి"నని చెప్పెను. "ఆసంగతి కేమి! ప్రాణాపాయమునకే వచ్చినది. కుతంత్రములఁ బన్నినచో నిట్టియోగ్గే కలుగును" అని విలాసుఁ డనుచుఁ దొందరగాఁ బోవుచుండ వార్తాహరుఁడు "కారణమే"మని యడిగెను. వీనిమాటను వినకయే విలాసుఁడు రక్షకభటాలయమునకు బోయెను.

* * * * *

౫

రాత్రి తొమ్మిదిగంటల సమయమున వాసుదేవరావుగారు విశాఖపట్టణమున మిత్రునితోఁ గొన్ని వ్యవహారములనుగూర్చి మాటలాడుచుండఁ గల్యాణి యకస్మాత్తుగ మరణింపనున్నదని తంతివార్త వచ్చెను. ఆవార్తను విని యాతఁడున్నట్టుననే నిలువున నీరయిపోయెను. ఇంతలో రక్షకభటాధికారి యొక రక్షకభటునితో వచ్చి "వాసుదేవరావుగారూ! మీబాలిక యకారణముగ మరణించినందులకు మేమెంతయుఁ జింతిల్లుచున్నాము. రామతీర్థమునుండి మాయధికారి యిపుడే తంతినంపియున్నాఁ"డని తెలియఁజేసెను. ఈవాక్యమును విని రావుగారు "అయ్యో! అయ్యో! మరణించెనా! అల్పమగు నీయాశ కూడ నడుగంటెనా!"అని వార్తగలపత్రమును పారవైచి నిలువునఁ గూలిపోయెను. అట్టియవస్థను జూచి యట నున్నవా రందఱును మిగుల విలపించిరి. కొంతవడికి రావుగారు లేచి కూర్చుండ రక్షకభటాధికారి "కాని, అయ్యా! నేను బలుకువాక్యములకు క్షమించి నామాటను వినుఁడు. ఇట్టిహత్యకుఁ గారణము మీ......" అని మఱి చెప్పఁజాలక పోయెను. రావుగా రామాటవిని "హా! ఎట్టికళంకము కలిగినది! గోరుచుట్టుపై రోఁకటిపోటా! అని యనుకొని "నాతో మీరు రండు. అక్కడకు బయలుదేఱిపోవలెను" అని వెంటనే ప్రయాణోన్ముఖుఁ డాయెను.

* * * * *

"దురాత్ము లెవ్వరో బూటకముగా మా పినతండ్రికి దీవ్రరోగము సంభవించెనని చెప్పిరి. ఆమాటలను విలాసుఁడు చెప్ప నిజమే యనుకొని పోవ వాత్తేరు స్టేషనునొద్దనే మా పినతండ్రి నన్నుఁ దెలిసికొని పలుకరించెనుగదా! ఇట్లు నన్ను బాధింప వారేమిలాభమును దలంచిరో! ఇదివఱ కెవ్వరికైన నే నిట్టికష్టముఁ గలిగించి యుండలేదే! ఎట్లయిననేమి, అందఱు సుఖముగ నున్నారుగదా! అంతియె చాలు" నని యనుకొనుచు మోహనుఁడు గ్రామమునుజేరి రావుగారియింటిని బ్రవేశించుచుండెను. ఇంతలో నాతని కెదురుగఁ బ్రసిద్ధులగు నాచార్యవైద్యులును, గ్రామములోని మఱియొకతెనుమనుష్యుఁడును వచ్చుచుండిరి. వారిని జూచి మోహనుఁడు ప్రక్కకుఁ దప్పుకొనెను. అందుఁ దెను మనుష్యుఁడు "మహాత్మా! ఏమైననాశయున్నదా!" అని సగద్గదముగనడిగెను. వైద్యులు "ఆర్యా! మనకుఁ దోఁచిన చికిత్స చేసితిమి. కాని మందు గుణమిచ్చుచున్నట్లు తోఁపదు. తరుణము మించిపోయినది. ఇష్టజనదర్శనమున కాప్రాణము తల్లడిల్లును నిలిచినది" అని పలుకుచు వెడలిపోయిరి.

ఆరోగియెవ్వరో యని మోహనుఁడు తల్లడిల్లుచుండెను. గృహములోనికిఁజని పరికింపనొకయెడఁ గొందఱు పరిశోధకులు పరీక్షించుచుండిరి మోహనుఁడు జాగ్రత్తగాఁ జూచుచుండెను. ఒకఁడు— "విలాసుఁడు రావలె" ననెను. మిత్రసహితముగ విలాసుఁడు వచ్చెను. అధికారి "ఔషధాలయమునకు నీవుపోయితివా! లేదా!" అని యడుగ నాతఁడు "లేద"ని చెప్పెను.

అధికారి: అది అసత్యము. నీ జేబురుమాల టకేల పోవును? ఒలికిన ద్రావకముకూడ దీనిపైఁ బడియున్నది.

విలాసుఁడు వెలవెలపోయెను. అధికారి లేటి పాఱజూచి "గృహసేవకుఁడు" అని యనెను. సేవకుఁడు రాఁగా నధికారి "విలాసుఁ డప్పుడప్పు డీ మందుకొట్టునకు వచ్చునా! తఱచుగనా!" అని యడిగెను. సేవకుఁడు "బాబూ! అప్పుడప్పుడు వచ్చును. మొన్నఁటి సోమవారమురాత్రి సీసాపడినచప్పుడు విని నే నిటకు రాఁగా నీతఁడే మందుకొట్టులో నా కగుపడెను. పైవారెవ్వరును గారని నేఁబోయితిని." అనెను. మోహనుఁడు తొందరతో "నన్ను మోసముచేసిన దుర్మార్గుఁడు వీఁడే" అని విలాసునిస్నేహితునిఁజూచియఱచెను. "మాపినతండ్రికిని జబ్బుచేసెనని పలికినదుర్మార్గుఁడు." అని పండ్లుపటపట కొఱికెను. అధికారి "ఇదికూడనా! ఓయీ! అతనిని వంచించితివా! నిన్ను బందిఖానాకుఁ గొంపోయెద" నని విలాసునితో నన నాతఁడు భయపడి, "అయ్యా! నేను నిరపరాధిని. ఈ నాస్నేహితునిమాట విని నేనట్లు చేసితిని. నాయపరాధము క్షమింపుఁడు"అని యన నధికారి "ఇట్లుచేయుటలో నీయభిప్రాయ మేమి?" అని విలాసు నడిగెను.

విలాసుఁడు మాటాడలేదు. భటులు వానిని గొట్టగా నిట్లనెను "ఇతఁ డుండిన మా స్నేహితుని కొకనికి మంచిమందు లభింపదని నే నిట్లు చేసితిని" అనెను. అధికారి "అసత్యము నీవీ బాలికను గాకపోయినమఱియెవ్వరినైన జంపఁదలంచి మందును మార్చి పొట్లములను గట్టి మాచువారల కనుమానము గలుగకుండఁ జేసితివి. పరేశాత్మ. విచారించి యుక్తదండనవిధించెద. పరోపకారపరాయణుఁ" డగు నీబాలుఁడు మంచిమం దీయఁడా! నీవంటి యభాగ్యునిఁ జేరఁదీయుటవలనఁ బంతులుగారికీ యాపదసంభవించెను. నాయెదుటినుండిమరలుము. రక్షకభటులు నిన్ను రక్షించెద" రని యొకనోటు వ్రాసెను.

'బాలిక' యనుమాట వినఁగానే మోహనుఁడు విపత్తు సంభవించెనని తెలిసికొని తా నిచ్చినమందు విషమే యని గ్రహించి "హా! నాయట్టి రాక్షసుఁ డీలోకమునఁ గలఁడా! శిరీషకుసుమమును గఠినతరవారిచే సంహరించితినే! నాజీవితమును నేనే పోఁగొట్టుకొంటినే!" అని వెక్కివెక్కి యేడ్చుచు నింటిని వెదకి బాలికయున్న గదిఁ జేరెను. బాలిక కింక నొకటిరెండు నిముసములలోఁ బ్రాణము పోవునన నీతఁడు ప్రవేశించెను. అచటఁ గల్యాణితల్లి కంటికిమంటికి నేకధారగా విలపించుచుండెను. అప్పుడే వచ్చిన వాసుదేవరావుగారును, మఱియొక తెను మనుష్యుఁడును, రక్షకభటాధికారి యొకఁడును మిక్కిలి విలపించుచుండిరి. రక్షకభటాధికారి రావుగారి నోదార్చుచుండెను. మోహనుఁ డెవ్వరితోడను బలుకకయే శయనముకడకుఁ బోయి వాడియున్న యాబాలికయొక్క ముఖమును జూచి యస్పష్టముగ



"మోహనుఁడు దుఃఖాతిరేకమున నోటమాటలేక కొయ్యబారి వెనుకకుఁ బడిపోవుచుండెను."

"కల్యాణీ! నీప్రాణతుల్యుఁడ నగు నన్నువీడి దివి కేఁగుచుంటివా!" యని వెక్కి-వెక్కి యేడ్చుచుండెను. కొన యూపిరితోనున్న యాబాలిక యొకమాఱు మోహనుని బలుకరింపఁడలంచెనే కాని యశక్తయయ్యెను. చూపుల తోడనే మోహనునొద్ద సెలవుగైకొని యొకటి రెండు కన్నీటిబిందువులనేకాక ప్రాణములను గూడ విడచెను.

ఇది ప్రత్యక్షముగఁ జూచుచున్న మోహనుఁడు దుఃఖాతిరేకమున నోటమాటలేక కొయ్యబారి వెనుకకుఁ బడిపోవుచుండెను. రక్షకభటాధికారి లేచి పడుచున్న మోహనునిఁ బట్టుకొని పరుండఁబెట్టెనే కాని యంతకమున్నే యాతఁడు విగతజీవుఁ డయ్యెను.

# వేఁడికోలు

## వెలగపూడి దానయ్యచౌదరి గారు

ఔత్తానపాదియట్లస్థిరంబగుభక్తి, నెండవానల కోర్చి యుండఁజాలఁ
బ్రహ్లాదులీల దుర్వారభక్త్యావేశ, నిగడిమైనిన్ను ధ్యానింపఁజాల
నారదుపగిది నీనామాక్షరంబులఁ, బ్రీతిగీతమునఁ గీర్తింపఁజాల
వ్యాసునిభాతి నీయతులితమహిమంబుఁ, బొగడికావ్యమొనర్పఁ బూనఁజాలఁ
తే. గాన, నోదేవ! యోపిక గలకొలంది, భక్తిభావంబునన్ నిన్నుఁ బ్రస్తుతింతు
నస్మదీయాఘములనెల్ల నడఁచివైచి, కరుణఁ దిలకించి సతము నన్ గావుమయ్య!